సాక్షి నంద్యాల

సోమవారం ; 8 ; ఏప్రిల్ ; 2024



అర్చకులకు అభయం!

అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ధూపదీప నైవేద్యం పథకంతో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. IIలో▸



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన పాలంకి కోటిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందించారు.



భక్తులకు పటిష్ట భద్రత

నల్లమల అడవుల్లో పాదయాత్ర భక్తుల రక్షణ కోసం శ్రీశైల దేవస్థానం సీసీ కెమెరాలతో పటిష్ట పర్యవేక్షణ చేపట్టింది. కైలాసద్వారం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:42
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:45
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:39
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:40
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:40

హదీస్ వెలుగు :

అల్లాహ్ మీరు చేసే పనులు గమనించడం లేదని అనుకోవద్దు. అమావాస్య చీకటిలో నల్లటి రాతికొండ కింద ఉన్న నల్ల చీమనూ చూస్తుంటారు. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

ముగిసిన పదవ తరగతి మూల్యాంకనం

నంద్యాల(న్యూటౌన్): 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి మూల్యాంకనం ఆదివారం ముగిసింది. జిల్లాకు 1,91,422 సమాధాన పత్రాలు రాగా 120 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 718 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 195 మంది ప్రత్యేక సహాయకులతో మొత్తం 1,033 మంది సిబ్బందితో విజయవంతంగా మూల్యాంకనాన్ని ముగించామని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల శిక్షణలో భాగంగా పీఓ, ఏపీఓ ఆర్డర్స్ వచ్చిన వారు ఈనెల 15, 16న వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణకు తప్పకుండా హాజరు కావాలని డీఈఓ సూచించారు.

కస్తూర్బా ప్రవేశానికి 11న తుది గడువు

కోవెలకుంట్ల: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 11వ తేదీ తుది గడువుగా ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 29 కేజీబీవీలు ఉండగా ఆయా విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరం 2,160 సీట్ల భర్తీకి గత నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన సాగే ఈ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 40 సీట్లు భర్తీ చేయనున్నారు. అలాగే ఇంటర్మీడియేట్‌కు సంబంధించి ఒక్కో పాఠశాలలో 40 చొప్పున సీట్లు ఉన్నాయి. విద్యార్థినులు ఆయా పాఠశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరోవైపు ఆయా పాఠశాలల్లో 7, 8, 9వ తరగతులు చదువుతూ మధ్యలో బడిమానివేసినా, ఇతర కారణాలతో ఖాళీ ఏర్పడిన సీట్లను ఈ విద్యా సంవత్సరంలో భర్తీ చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థినిలు ఆన్‌లైన్‌లో 'ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన విద్యార్థినీలకు ఫోన్ మెసెజ్ ద్వారా సమాచారం అందిస్తారు. అడ్మిషన్లు పొందినవారి వివరాలను ఆయా పాఠశాలల నోటిఫికేషన్ బోర్డులో ప్రదర్శిస్తారు. అసిస్టెంట్ లేబర్ సహాయశాఖ అధికారులు సిఫారసు చేసిన వలస కూలీల చిన్నారులకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుంది.

పెరుగుతున్న 'సూర్య' ప్రతాపం

- చాగలమర్రిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం చాగలమర్రిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. ఆలూరులో 45.4, బనగానపల్లిలో 45.4, డోన్‌లో 45.4, పాణ్యంలో 45.2, గోస్పాడులో 45.0, మంత్రాలయంలో 45.0, శ్రీశైలంలో 44.7 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ నెల మొదటి పక్షంలోనే ఉష్ణోగ్రతలు దాదాపు 46 డిగ్రీలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు ఏ స్థాయికి చేరుతాయోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో ఏడు మండలాల్లో వడగాలుల తీవ్రత ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. రానున్న రోజుల్లో ఎండలు, ఉష్ణోగ్రతల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని, ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్లు ప్రతి ఒక్కరూ తీసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించింది. సోమవారం కూడా గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. నడవలేనివారు, డయాలసిస్ పేషెంట్లకు.. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటిదగ్గరే పంపిణీ చేశారు. మిగిలిన వారు సచివాయాలకు రాగా... పడిగాపులు కాయకుండా పింఛన్ సొమ్ము అందచేశారు. కర్నూలు జిల్లాలో 2,595, నంద్యాల జిల్లాలో 2,017 మంది పింఛన్ తీసుకోవాల్సి ఉంది. వీరు పింఛన్‌లు పొందడానికి నేడు ఆఖరు రోజు.

టీడీపీ హయాంలో..

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమానికి ఒక్కటంటే ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. రుణమాఫీ హామీని తుంగలో తొక్కారు. టీడీపీ హయాంలో జిల్లాలో ఐదేళ్లు పంట కాలువలకు నీరు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. సీజన్‌కు ముందు పంట పెట్టుబడికి డబ్బులు దొరికేవి కాదు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద భారీ వడ్డీతో అప్పు తీసుకోవాల్సి వచ్చేది. అప్పుల బాధ తాళలేక టీడీపీ హయాంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అప్పట్లో లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రైతులకు పంట రుణాలు పంపిణీ చేయలేదు. పంటలకు ప్రీమియం చెల్లించినా బీమా పరిహారం అందేది కాదు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే రైతుల కష్టాలకు కూడా ముగింపు పలికినట్లు అయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా వివిధ పథకాలు అమలు చేశారు. 2023–24 ఒక్క ఏడాది మినహా ప్రతి ఏటా పుష్కలంగా వర్షాలు కురిశాయి. నీటి వనరులను సద్వినియోగం చేసేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవడంతో పంటలు చేతికందాయి. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆర్థిక తోడ్పాటు అందింది. దీంతో చంద్రబాబు హయాంలో కాడి వదిలేసిన రైతులు మళ్లీ సాగు బాట పట్టారు. టీడీపీ హయాంతో పోలిస్తే దాదాపు 20 శాతం మంది రైతులు అదనంగా సాగులోకి వచ్చారు.



ఆర్‌బీకేలో సిద్ధంగా ఉంచిన పశువుల చికిత్సకు ఉపయోగించే మందులు



యంత్రసేవ కింద ట్రాక్టర్లను పొందిన లబ్ధిదారులు (ఫైల్)

రైతు క్షేమం.. సాగు లాభం

- రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్
- పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, యంత్ర సేవ పథకాల అమలు
- రైతులకు అండగా నిలిచిన ఆర్‌బీకేలు, అగ్రిల్యాబ్‌లు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు
- ఐదేళ్లలో జిల్లా రైతులకు రూ.1,864.96 కోట్ల లబ్ధి



గోస్పాడు: సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం.. సబ్సిడీపై విత్తనాలు.. సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు.. పంట నష్టపోతే వెంటనే పరిహారం.. ప్రతి పంటకూ మద్దతు ధర.. ఇలా రైతులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అన్నదాతల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. ఉన్న ఊర్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. టీడీపీ హయాంలో వరుసగా ఐదేళ్లు కరువు నెలకొంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చర్యలతో రైతులు ఆనందంగా పంటలు సాగు చేస్తున్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. రైతు భరోసా కింద నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12,500 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి.. చెప్పిన దానికంటే మిన్నగా ఐదేళ్లపాటు ఏడాదికి రూ.13,500 చొప్పున ఇచ్చారు. వరుసగా రెండేళ్లు కరోనా రక్కసితో ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా.. ఎలాంటి కోతలు లేకుండా సీజన్‌కు ముందే రైతు భరోసా పథకాన్ని అమలు చేశారు. జిల్లాలో ఈ పథకం కింద ఐదేళ్లలో 2.18 లక్షల మంది రైతులకు రూ. 1,474 కోట్ల ఆర్థిక ప్రయోజనం లభించింది. దీంతో పెట్టుబడి సమస్యలు తొలగి రైతులు ఉత్సాహంగా సాగు చేపట్టారు. పెద్ద మనసుతో సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు, ఆర్‌వోఎఫ్ఆర్ రైతుల (అటవీ భూములు అనుభవిస్తున్నవారు), దేవదాయ భూములు అనుభవిస్తున్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసా పథకాన్ని అమలు చేసింది. ఐదేళ్లలో జిల్లా రైతులకు ఆయా పథకాల కింద రూ.1,864.96 కోట్ల లబ్ధి చేకూరింది.

జిల్లాలో రైతులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలు

సంవత్సరం		పథకాలు: ఇన్‌పుట్ సబ్సిడీ	సున్నవడ్డీ రుణాలు	వైఎస్సార్ యంత్రసేవ	ఉచిత పంటల బీమా	రైతు భరోసా
2019-20	లబ్ధిదారులు	21,846	60,234	490	--	2,09,861
	లబ్ధి (రూ. కోట్లలో)	19.32	63.99	1.77	--	283.03
2020-21	లబ్ధిదారులు	76,277	83,906	290	49,204	2,15,936
	లబ్ధి (రూ. కోట్లలో)	59.74	16.92	1.57	63.55	291.5
2021-22	లబ్ధిదారులు	13,470	37,344	925	39,998	2,15,595
	లబ్ధి (రూ. కోట్లలో)	12.36	6.18	7.91	60.00	291.1
2022-23	లబ్ధిదారులు	12,855	--	690	49,637	2,21,241
	లబ్ధి (రూ. కోట్లలో)	11.58	--	5.20	46.68	298.7
2023-24	లబ్ధిదారులు	15,820	--	--	--	2,34,151
	లబ్ధి (రూ. కోట్లలో)	12.15	--	--	--	311.5

అన్నదాత చెంతకు సేవలు..

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాల పరిష్కరించేందుకు ఎన్నో విప్లవాత్మక మార్పులు చేపట్టారు. ఈ క్రమంలో రైతు భరోసా కేంద్రాలను ఊరూరా నిర్మించారు. నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి వాటికోసం నూతన భవనాలు నిర్మించే చర్యలు చేపట్టారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.21.80 లక్షల నిధులను మంజూరు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 222 ఆర్బీకేలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి వివిధ దశలో ఉన్నాయి. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన వాటి కోసం ప్రభుత్వం రూ.5,132.64 లక్షలను ఖర్చు చేసింది. అధికారులు మండల, గ్రామస్థాయిలో రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా విస్తతంగా సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో అన్ని రకాల సేవలు లభిస్తున్నాయి. వీటిలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నిర్దిష్టమైన ధరలకే లభ్యమవుతున్నాయి. సాగుకు అవసరమైన యంత్రాలు కూడా అద్దె ప్రాతిపదికన ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ రైతుకు వెన్ను దన్నుగా నిలుస్తున్నారు.

పాడి రైతుకు అండగా..

సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం మరెన్నో రూపాల్లో పాడి రైతు చేయూతనందిస్తోంది. అన్ని రకాల పశువులకు 1.57 లక్షల ఆరోగ్య కార్డులు ప్రభుత్వం జారీ చేసింది. పశు వైద్యాన్ని మరింత పటిష్ట పరిచేందుకు వైఎస్ఆర్ వెటర్నరీ అంబులెన్స్‌లు, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను నెలకొల్పి మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందిస్తోంది. టోల్‌ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేస్తే చాలు... అరగంట నుంచి దూరాన్ని బట్టి రెండు గంటల వ్యవధిలో అంబులెన్స్ వచ్చి వైద్య సేవలు అందిస్తోంది. దేశీయ మేలు జాతి ఆవుల పొరాల ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. నాణ్యమైన దాణా అందించేందుకు తయారీ, అమ్మకందార్లకు లైసెన్సులు తప్పనిసరి చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పశువులు మృతి చెందితే వైఎస్సార్ బీమా సాయం అందించడం ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది.

రైతులను ఆదుకున్నారు



వైఎస్ జగన్ సీఎం అయ్యాక రైతు కుటుంబాలను అన్ని విధాలా అండగా నిలిచి ఆదుకున్నారు. రైతు భరోసానే కాకుండా అర్హత ఆధారంగా అన్ని రకాల సంక్షేమాలు అందించడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందారు. మా కుటుంబానికి వరుసగా నాలుగేళ్ల పాటు రూ.13,500 రైతు భరోసా వచ్చింది. నాకు దివ్యాంగ పింఛన్, నా భార్యకు వృద్ధాప్య పింఛన్ వస్తున్నాయి. ఈబీసీ నేస్తం కింద రెండు విడతలుగా రూ.15వేలు అకౌంట్‌లో పడ్డాయి. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.50 వేలు వచ్చాయి. సున్నా వడ్డీ కింద రూ.40 వేలు జమ అయ్యాయి. మా కుటుంబానికి అర్హతను బట్టి అన్ని పథకాలు వర్తించాయి. చాలా సంతోషంగా ఉంది.

– రంగయ్య, కమ్మవారిపల్లె, కొలిమిగుండ్ల మండలం

యంత్ర సేవ ద్వారా లబ్ధి చేకూరింది



వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతు మిత్ర గ్రూపునకు యంత్ర సేవా కింద ట్రాక్టర్‌తో పాటు అందుకు అవసరమైన వ్యవసాయ పరికరాలు అందజేసింది. 40 శాతం సబ్సిడీ కింద యంత్ర సేవ పథకంతో లబ్ధి పొందాం. ఈ పథకం కింద రూ.15 లక్షలు విలువ చేసే యాంత్రీకరణ పరికరాలు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరువలేను. తమకు ఎంతగానో ప్రయోజనం చేకూరింది.

– సిద్దయ్య రైతు, సాంబవరం, గోస్పాడు మండలం

నష్టపరిహారం సకాలంలో అందింది



రైతులు సాగుచేసిన పైర్లు ఏదైనా విపత్తు జరిగి నష్టపోయినా, దెబ్బతిన్న ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వ్యవసాయ సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉంటూ రైతులు సాగుచేసిన పైర్లను ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారు. దీంతో గత ఏ డాది పత్తి సాగు చేసి నష్టపోయాను. ఈక్రాప్ నమోదు చేసుకోవడంతో క్రాప్ ఇన్సూరెన్స్ కింద రూ.15,858 లబ్ధి చేకూరింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతో ఎంతగానో ఉపయోగపడింది. తాము ఎక్కడికి తిరగకుండానే ప్రభుత్వ పథకాలు మా ఇంటికి చేరుతున్నాయి.

– చంద్రశేఖర్, రైతు ఒంటివెలగల

కైలాస వాహనాధీశా నమోనమః



స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

- మహాదుర్గగా దర్శనమిచ్చిన శ్రీశైల భ్రామరి
- కన్నడ భక్తులతో పోటెత్తిన శ్రీశైలం
- నేడు ప్రభోత్సవం, నంది వాహనసేవ, వీరాచార విన్యాసాలు



ఆలయ ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ



దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. రెండోరోజు ఆదివారం శ్రీగిరిలో భ్రమరాంబాదేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు కైలాసవాహనాన్ని అధిష్టించి భక్తులను అనుగ్రహించారు. అమ్మవారు ఎనిమిది భుజాలతో శోభిల్లుతూ భక్తులను కటాక్షించారు. శంఖం, చక్రం, గద, పద్మం, త్రిశూలం, ఖడ్గం ధరించి అభయమిచ్చారు. ఉగాది మహోత్సవాల్లో రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు చండీశ్వరపూజ, మండపారాధన, లోకకల్యాణం కోసం జపానుష్ఠానాలు నిర్వహించారు. 9 గంటలకు స్వామివారి యాగశాలలో రుద్రహోమం, అమ్మవారి యాగశాలలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన, నవావరణార్చనలు, సాయంత్రం జపానుష్ఠానములు జరిపించారు. అనంతరం ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో కైలాస వాహనాన్ని అధిష్టించిన స్వామిఅమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. మహాదుర్గగా అలంకృతులైన భ్రమరాంబాదేవిని, కైలాసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రాజగోపురం మీదుగా క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తొడ్కొనివచ్చారు. క్షేత్ర పురవీధుల్లో కన్నడ భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు అక్కడి నుంచి బయలువీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది. గ్రామోత్సవంలో కోలాటం, చెక్కభజన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్మువాయిద్యాలు ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఏఈవోలు హరిదాసు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తారు. స్వామి అమ్మవార్లకు నందివాహనసేవ, శ్రీభ్రమరాంబాదేవికి మహాసరస్వతి అలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు వీరశైవుల వీరాచార విన్యాసాలు, అగ్నిగుండప్రవేశం నిర్వహిస్తారు.

నీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌లైన్

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం భూ గర్భ జలాలు తగ్గినందున పట్టణంలో మున్సిపల్ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్న ప్రాంతాల ప్రజలు మున్సిపల్ అధికారులకు హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పట్టణంలో నీటి ఎద్దడి ఏర్పడిన అన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు 6 నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మంచి నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని కోరారు. నీటికి సంబంధించిన సమస్యలు ఉంటే సెల్ 7702776048 నంబరుకు ఫోన్, వాట్సప్ ద్వారా సంప్రదించాలన్నారు. ఉదయం 8.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించి సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

టీడీపీని వీడిన 100 కుటుంబాలు



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన గుడిపాడుకు చెందిన టీడీపీ శ్రేణులు

డోన్: ప్యాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వంద కుటుంబాల వ్యక్తులు టీడీపీని వీడి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన అభివృద్ధి పట్ల ఆకర్షితులై వైఎస్ఆర్‌సీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, గ్రామ నాయకులు చిన్నపుల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున, ఉప సర్పంచ్ మధు, నారాయణ స్వామిల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గోవిందు, జక్కసానికుంట్ల క్రిష్ణ, ఓబులేసు, కొప్పుల నాయుడు, పరుశురాం, లక్ష్మీనారాయణ, గోపాల్, కొండా నరసింహులు, ఓబులేసు, రామచంద్రుడు, రాజా, మల్లికార్జునరెడ్డి, శరత్‌రెడ్డి, మహేష్, రమేష్, శ్రీనాథ్, జక్కుల బాలరంగడు, మహేంద్ర, జక్కల మల్లికార్జున, రామ్మూర్తి, వెంకటేష్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ప్యాపిలి మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరాంరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు గడ్డం భువనేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వాటర్ బెల్ మోగించాలి

- వేసవి నేపథ్యంలో బడి పిల్లల ఆరోగ్యంపై దృష్టి
- రోజులో మూడుసార్లు తప్పనిసరి
- విద్యా శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశం



ప్రభుత్వ పాఠశాలలో వాటర్‌బెల్ తర్వాత నీరు తాగుతున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు విద్యాశాఖ జాగ్రత్తలు చేపట్టింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గతేడాదితో పోల్చితే రెండు, మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా, నిర్ణీత సమయానికి తాగునీటిని విద్యార్థులు తాగే విధంగా వాటర్ బెల్ విధానాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో వాటర్ బెల్స్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు విధిగా వాటర్ బెల్ పాటించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. విద్యార్థులు నీటిని తాగేందుకు వీలుగా రోజులో మూడుసార్లు వాటర్ బెల్ మోగించాల్సి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు, తిరిగి 10.05 గంటలకు, చివరగా 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి, విద్యార్థులు నీరు తాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ మార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ననుసరించి జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 1676 పాఠశాలల్లో వాటర్ బెల్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఇతరుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని స్కూళ్లకు హెచ్ఎంలకు సూచించారు. ప్రతి స్కూల్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

గుర్తు చేసి మరి నీరు తాగేలా చూడండి

ఎండలు మండుతున్నాయి. పిల్లలు డీహైడ్రేషన్ బారిన పడకుండా మూడుసార్లు వాటర్ బెల్ కొట్టి నీరు తాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని స్కూళ్లకు పంపించాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గుర్తు చేసి మరి పిల్లలు నీరు తాగేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. – సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి, నంద్యాల

24 నుంచి వేసవి సెలవులు...

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు అన్ని యాజమాన్య పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పదవ తరగతి వార్షిక పరీక్షలు పూర్తయి ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. అలాగే 1–9 తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. 19 నుంచి 21 లోపు ఆయా పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. చివరి రోజున ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందజేయనున్నారు.

క్లుప్తంగా

డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుల్లయ్య



నూతనంగా ఎన్నికైన సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వై. పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలులోని కెమిస్ట్ భవన్‌లో ఎన్నికలు నిర్వహించారు. వై. పుల్లయ్యతో పాటు కార్యదర్శిగా ఎం. శ్రీధర్, కోశాధికారిగా జి. విజయకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కడప జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు టి. నరసింహమూర్తి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

కర్నూలు: ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారిలోని పాత ఈద్గా వద్ద మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. సుమారు 55 సంవత్సరాల వయసు ఉండి అనారోగ్యంతో చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. కొంతకాలంగా ఆమె ఆ ప్రాంతంలో తిరుగుతూ భిక్షాటన చేస్తూ ఉండేదని, ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగుతుంటే చుట్టుప్రక్కల వారు ఆమెకు నైటీ తగిలించి సపర్యలు చేశారు. గుర్తు తెలియని మహిళ శవం రోడ్డుపై పడి ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నాల్గవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ జరపగా వారం రోజులుగా ఆమె మతిస్థిమితం లేకుండా ఆ ప్రాంతంలో తిరుగుతున్నట్లు బయటపడింది. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పొగాకు బేళ్లు దగ్ధం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో ఆదివారం రూ.8 లక్షలు విలువ చేసే పొగాకు బేళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన చాకలి సుబ్బరాయుడు, అహమ్మద్, మదార్‌సాలు నిల్వ ఉంచిన బేళ్లకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరారు.

అర్చకులకు అభయం!

- అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- జిల్లాలో 124 దేవాలయాలకు ధూపదీప నైవేద్యం పథకం వర్తింపు
- పలువురు అర్చకులకు రూ.5 నుంచి రూ.15 వేల వరకు వేతనం పెంపు
- అర్చక సంక్షేమ నిధి ద్వారా 67 మందికి నెలకు రూ.15 వేలు
- తాజాగా అల్పాదాయ ఆలయాల నిర్వహణ బాధ్యత అర్చకులకు అప్పగించేందుకు నిర్ణయం



శ్రీ లలితాంబికా దేవి ఆలయం

కర్నూలు కల్చరల్: నిత్యం దేవుడి సేవలో ఉంటూ భక్తుల కోరికలు, కష్టాలను దైవానికి తెలుపుతూ వారికి స్వాంతన చేకూర్చేందుకు కృషి చేస్తుంటారు అర్చకులు. అయితే, వీరిలో చాలా మంది ఆర్థిక స్తోమత సరిగా లేక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారిని గుర్తించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. జిల్లాలో మొత్తం 1958 హిందూ దేవాలయాలు ఉండగా అందులో 340 దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. ఆ ఆలయాల పరిధిలోనున్న కనీస ఆదాయం లేని 124 ఆలయాలకు ఇప్పటికే ధూప దీప నైవేద్యం పథకం వర్తింపజేస్తోంది. పథకం వర్తింపజేసేందుకు అర్హత కలిగిన మరిన్ని ఆలయాలను గుర్తిస్తున్నారు. ధూప దీప నైవేద్యం పథకంతో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా ఆలయాలకు చేస్తున్న ఆర్థిక సాయాన్ని రూ.5 నుంచి రూ.10 వేల వరకు పెంచారు. అర్చక సంక్షేమ నిధి ద్వారా 67 దేవాలయాలకు రూ.10 నుంచి 15 వేల వరకు ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఏడాదికి రూ.2 లక్షల్లోపు అల్పాదాయం కలిగిన ఆలయాల నిర్వహణ బాధ్యతను అర్చకులకే అప్పగించనున్నారు. తద్వారా అర్చకులకు అన్ని విధాలా భరోసా కల్పిస్తోంది.

124 ఆలయాలకు పథకం వర్తింపు

కనీస ఆదాయం లేని ఆలయాలకు ప్రభుత్వం ధూప దీప నైవేద్యం పథకం వర్తింపజేస్తున్న విషయం తెలిసిందే. ఆలయాల పునరుద్ధరణ, అర్చకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని అప్పట్లో ప్రారంభించారు. జిల్లాలో 124 ఆలయాలకు ఈ పథకం వర్తిస్తోంది. ఇప్పుడు డీడీఎన్ఎస్ పరిధిలోకి మరిన్ని ఆలయాలను తీసుకురానున్నారు.

అల్పాదాయ ఆలయాల నిర్వహణ అర్చకులకే

జిల్లాలోని అల్పాదాయం కలిగిన ఆలయాల నిర్వహణ అర్చకులకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా స్థానిక దాతల సహకారంతో ఆ ఆలయాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏడాదికి రూ.2 లక్షల్లోపు ఆదాయం కలిగిన ఆలయాలను అధికారులు గుర్తిస్తున్నారు.

జిల్లాలో ఆలయాల వివరాలు

- జిల్లాలో మొత్తం ఆలయాలు: 1,958
- దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలు: 340
- 6ఎ గ్రూప్: 6 (రూ. 25 లక్షల పైన ఆదాయం ఉన్నవి)
- 6బి గ్రూప్: 32 (రూ.2 నుంచి రూ.25 లక్షల లోపు ఆదాయం ఉన్నవి)
- 6సి గ్రూప్: 1906 (రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్నవి)
- 6డి గ్రూప్: 14 (మఠాలు, పీఠాలు)

67 మంది అర్చకులకు గౌరవ వేతనం

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం అర్చక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ నిధి ద్వారా జిల్లాలోని 67 ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గౌరవ వేతనం కింద నెలకు రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు అందజేస్తోంది. తద్వారా అర్చకులకు జీవనోపాధి కల్పిస్తోంది. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు దేవదాయ శాఖ కసరత్తు చేస్తోంది.

సీఎం జగన్ సాయం మరువలేనిది



మాది మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం కందుకూరు గ్రామం. శ్రీ లలితాంబికా దేవి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాను. ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాలాంటి అర్చకుల స్థితి గతులను అర్థం చేసుకొని ప్రభుత్వం ద్వారా ధూప దీప నైవేద్యం స్కీం, అర్చక సంక్షేమ నిధి ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం నాకు నెలకు రూ.5000 వేతనం రెగ్యులర్‌గా వస్తుంది. దీని వల్ల మా కుంటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుంది. ఈ అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉంటాం.

– మల్లయ్య స్వామి, అర్చకులు, శ్రీ లలితాంబికా దేవి ఆలయం

అన్నివిధాలుగా అర్చకులకు అండ



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్చకుల సంక్షేమానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ అర్చకులకు అండగా నిలుస్తున్నారు. అర్చకుల తరపున ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులే నిర్వహించుకునేలా ఆదేశాలు జారీ చేశారు. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేశారు. అర్చకులకు వేతనాలు పెంచారు. 439 జీఓ ద్వారా అర్చకులకు వంశ పారంపర్య హక్కు కల్పించారు. దేవాలయాల ఆస్తులు ఆక్రమణకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

– కోటపాడు శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ అర్చక సమాఖ్య

డీడీఎన్ఎస్‌కు ఆలయాలను గుర్తిస్తున్నాం..



జిల్లా వ్యాప్తంగా కనీస ఆదాయం లేని 124 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం వర్తింప చేస్తున్నాం. ప్రస్తుతం మరికొన్ని ఆలయాల గుర్తింపు జరుగుతోంది. ఆలయాల్లో నిత్యం పూజాధికాలు నిర్వహించే ఆలయాల అర్చకులు డీడీఎన్ఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే విచారణ చేయించి పథకానికి అర్హత ఉంటే డీడీఎన్ఎస్‌కు ప్రతిపాదనలు పంపుతాం.

– సుధాకర్‌రెడ్డి, సహాయ కమిషనర్, దేవదాయ శాఖ

కార్యకర్తలు లేక చిన్నారులతో ప్రచారం



బీజేపీ జెండాలు మోస్తున్న బాలురు

ఆదోని అర్బన్: బీజేపీ అభ్యర్థి పార్థసారథి ప్రచారానికి కార్యకర్తలు కరువయ్యారు. దీంతో ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ చిన్నారులతో జెండాలు పట్టించి ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం స్థానిక మేదర్‌గేరి నుంచి నిర్మల్ టాకీస్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు పాదయాత్ర చేస్తూ ప్రధాన రహదారుల్లోని షాపుల్లోకి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. అయితే ప్రచారంలో కార్యకర్తలు లేకపోవడంతో బాలురతో జెండాలను మోయించారు. మేదర్‌గేరిలో పాదయాత్రను ప్రారంభించి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వెళ్లిపోయారు. కునిగిరి నీలకంఠ, గుడిసె క్రిష్ణమ్మ, దేవేంద్రప్ప, శ్రీకాంత్‌రెడ్డి కొంత దూరం వెళ్లిన తర్వాత కనిపించలేదు. మిగిలిన నాయకులు కూడా మధ్యమధ్యలో జారుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తరపున ఒక కార్యకర్త కూడా కనిపించకపోవడం గమనార్హం. ఇందులో జనసేన నాయకుడు మల్లప్ప కూడా కనిపించలేదు. ఆయన తరపున కేవలం ఐదుగురు మాత్రమే ప్రచారంలో కనిపించారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు లేకపోవడంతో పాదయాత్ర ప్రచారం వెలవెలబోయింది.

నేటి నుంచి యథాతథంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్, ఆరోగ్య సురక్ష కార్యక్రమాల హెల్త్ క్యాంపులు సోమవారం(8వ తేదీ) నుంచి యథాతథంగా ఎన్నికల కోడ్ నియమావళి పాటిస్తూ నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన తన చాంబర్‌లో జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూమ్ సమావేశం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సైతం ఈ విషయమై వివరించినట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రపంచ ఆరోగ్య దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఈ నియమాలు పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, డీపీఎంయు డాక్టర్ ఉమా, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్య, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డెమో ప్రమీలాదేవి, ఎస్‌వో హేమసుందరం, డీపీహెచ్ఎన్‌వో ఇందిర పాల్గొన్నారు.

ముసానహళ్లిలో 'అఖండ' ఆచారం

- అఖండ దీపాలు చూడనిదే పొలిమేర దాటని గ్రామస్తులు
- ఉగాది పర్వదినాన ప్రభోత్సవం



సోమలింగేశ్వర స్వామి ఆలయంలో వెలుగుతున్న అఖండ దీపాలు



ముసానహళ్లి గ్రామంలోని సోమలింగేశ్వర ఆలయం

ఆలూరు రూరల్: పని మీద బయటకు వెళ్లేటప్పుడు కొందరు శుభ ముహూర్తం చూసుకుంటారు. మరి కొందరు సెంటిమెంట్‌తో తమకు ఇష్టమైన వారిని ఎదురుగా రమ్మంటారు. ఆ ఊరిలో మాత్రం ఆలయంలో అఖండ దీపాలు చూడనిదే ఆ గ్రామస్తులు పొలిమేర దాటరు. శుభ కార్యాలకు వెళ్లరు. పొలాలకు వెళ్లాలన్నా దీపాలు చూడాల్సిందే. అఖండ దీపాలు వరుస క్రమంలో కనిపంచకపోతే తమ పనులను వాయిదా వేసుకుంటారు. ఇలాంటి సంప్రదాయాలకు అద్దం పడుతున్న ఆ గ్రామం ఆలూరు మండల కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామం పేరు మూసానహళ్లి. 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామానికి మరో ప్రత్యేకత ఉంది. మహాయోగి లక్ష్మమ్మ అవ్వ పుట్టిన గ్రామం ఇది. శతాబ్దాల క్రితం మూసానహళ్లి గ్రామంలో శ్రీ సోమలింగేశ్వస్వామి కొలువయ్యారు. ఆయన అప్పట్లో ప్రజలకు మహిమలు చూపించాడని గ్రామస్తులు చెపుతున్నారు. ఆలయంలోని అఖండ దీపాలు ప్రాచీన కాలం నుంచి నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీపధూప నైవేద్యానికి 40 ఎకరాల భూమిని గ్రామ పూర్వీకులు కేటాయించారు. ప్రస్తుతం ఆ భూమిని ఆలయ అర్చకులు సాగు చేసుకుంటున్నారు. అఖండ దీపాల కోసం నూనెను గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి కుటుంబీకులు అందిస్తున్నారు. గ్రామంలో 70 శాతం వరకు ప్రతి ఇంట్లో సోమలింగేశ్వర స్వామి పేరు కలిగిన వ్యక్తులు ఉన్నారు. నిత్యం సోమేశ్వర స్వామి ఆలయ తలుపులు తెరుచుకొని ఉంటాయి.

ఉగాది పర్వదినాన సోమేశ్వర స్వామి ప్రభోత్సవం

ఈ నెల 9వ తేదీ ఉగాది పర్వదినాన సోమేశ్వర స్వామి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూసానహళ్లి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం 6 గంటల భక్తుల నడుమ స్వామి ప్రభను లాగనున్నారు.

చీర కొంగు బైక్ చక్రానికి చుట్టుకుని..

- ఉపాధ్యాయురాలు దుర్మరణం



మృతురాలు రాణిబాయి

ఆళ్లగడ్డ: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఓ ఉపాధ్యాయురాలు ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. కోవెలకుంట్లకు చెందిన రాణిబాయి (22) ప్రస్తుతం కోవెలకుంట్ల మండలం భీమునిపాడు స్పెషల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆదివారం అహోబిలేశుడిని దర్శించుకునేందుకు తమ్ముడు శ్రీధర్ నాయక్ బైక్‌పై వెళ్లారు. అక్కడ దేవుడికి మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తుండగా ఆళ్లగడ్డ పట్టణ శివారులోని పడకండ్ల ఎయిడెడ్ స్కూల్ సమీపంలో ఆమె చీర కొంగు బైక్ చక్రానికి చుట్టుకోవడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి భర్త గంగానాయక్, ఏడాదిన్నర కొడుకు ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నగీన తెలిపారు.

వడదెబ్బకు కర్ణాటక మహిళ మృతి

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజాపూర్ మహిళ వడదెబ్బతో మృతిచెందింది. ఆదివారం ఉదయం 11 గంటలకు వెంకటాపురం నుంచి కాలినడకన నాగలూటి పుణ్యక్షేత్రం సమీపానికి వెళ్లగా ఎండ అత్యధికంగా ఉండడంతో మహిళ క్షేత్ర సమీపానికి చేరుకోక మునుపే వడదెబ్బకు గురై పడిపోయింది. బంధువులు నాగలూటి ఉచిత వైద్యశిబిరంలో చూపించారు. అయితే అప్పటికే ఆ మహిళ మృతిచెందడంతో కర్ణాటకవాసులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఈ మహిళ ఇంద్రాభాయి(30)గా గుర్తించారు.

పందులకు సీఎఫ్ఎస్ టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): క్లాసికల్ స్వైన్ ఫీవర్ నివారణకు ఈ నెల 8 నుంచి పందులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో ఈ వ్యాధితో పందులు పెద్ద సంఖ్యలో మృతిచెందాయని, ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం లేకపోయినప్పటికీ ముందు జాగ్రత్తగా టీకాలు చేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ చేపట్టిందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు 8,700, నంద్యాల జిల్లాకు 2,800 డోసుల సీఎఫ్ఎస్ వ్యాక్సిన్ వచ్చిందని తెలిపారు. టీకాలను డివిజన్ల ద్వారా ఏరియా హాస్పిటల్స్, వెటర్నరీ డిస్పెన్సరీలకు సరఫరా చేశామని, మూడు నెలల పైబడి వయస్సు ఉన్న పందులన్నింటికీ టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల నృత్యం

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురు భక్తులను అలరించాయి. ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై శ్రీశైల జగద్గురు సేవా సమితి ట్రస్ట్ వారిచే అధ్యాత్మిక ప్రవచనం(కన్నడ), భజన, భక్తి సంగీత విభావరి నిర్వహించారు. అలాగే ఆలయ పుష్కరిణి వేదికపై హైదరాబాద్‌కు చెందిన తాండవ ఆర్ట్స్ వారిచే కూచిపూడి నృత్యం, బీఆర్‌వీఎస్ పవన్‌కుమార్ చరణ్, బృందం వారిచే ప్రసిద్ధ నేపథ్య గాయనీ గాయకులచే భక్తి సంగీత విభావరి (కన్నడ), శివదీక్షా శిబిరాల వద్ద కర్ణాటక విజయపురానికి చెందిన నాట్యకళా డ్యాన్స్ అకాడమీ వారు భరతనాట్యం ప్రదర్శించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ సెంటర్లలో మౌలిక సదుపాయాల కల్పించాలని ఆ నియోజకవర్గ ఆర్ఓ/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె ఆయా కేంద్రాలతో పాటు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. ఇంజినీరింగ్ బ్లాక్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, పార్కింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు తాగునీరు, భోజనం, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట కల్లూరు తహసీల్దార్ మునివేలు, మునిసిపల్ ఇంజినీరు రవిప్రకాష్ పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు పటిష్ట భద్రత

- మొదటిసారిగా నల్లమల అడవుల్లో సోలార్ ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలలో రికార్డు అయిన నల్లమల అడవుల్లో పాదయాత్రగా వస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: నల్లమల అడవుల్లో పాదయాత్రగా తరలివచ్చే భక్తుల రక్షణ కోసం శ్రీశైల దేవస్థానం మొట్టమొదటిసారిగా సీసీ కెమెరాలతో పటిష్ట పర్యవేక్షణ చేపట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవస్థానం ప్రత్యేక చొరవ చూపి పాదయాత్ర భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టింది. నల్లమల అడవుల్లో ఎటువంటి విద్యుత్ సౌకర్యం లేదు. అలాగే ఫోన్ సిగ్నల్స్ కూడా అందుబాటులో ఉండవు. ఈ నేపథ్యంలో పాదయాత్రగా నల్లమల అడవుల్లో తరలి వచ్చే భక్తులకు ఏదేని అత్యవసర అవసరమొస్తే సమాచారం రావడం ఆలస్యమవుతుంది. ఆ పరిస్థితి నుంచి అధిగమించేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఆదేశాల మేరకు దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, ఏఈ మైలా చిరంజీవి ఆధ్వర్యంలో కైలాస ద్వారం వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. శ్రీశైల క్షేత్ర పరిధిలో మొత్తం 569 కెమెరాలతో భద్రత పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానం పరిపాలన కార్యాలయం వద్ద కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి టీవీల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో కైలాసద్వారం వద్ద రెండు పీటీజీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి పాదయాత్రగా తరలివచ్చే భక్తులు ఎంత మంది వస్తున్నారు అని లెక్క కడుతుంది. మరొక కెమెరా పాదయాత్ర భక్తుల పర్యవేక్షణ కోసం కైలాసద్వారం నుంచి సుమారు 3కిలోమీటర్ల దూరం వరకు రికార్డు అయ్యేలా ఏర్పాటు చేశారు. పాదయాత్ర భక్తుల భద్రత కోసం, ఏదేని అత్యవసర సహాయం అందించేందుకు వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి కరెంట్ సౌకర్యం లేనప్పటికీ సోలార్ ద్వారా ఏర్పాటు చేశారు. నెట్‌వర్క్ మొత్తం వైర్‌లెస్ ద్వారా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు లైవ్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. సీసీ కంట్రోల్ రూంలో సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.